
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 28 । నవంబర్ । 2024



సోమశిలలో 70.122 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారం 70.122 టీఎంసీల నీరుంది. పెన్నార్ డెల్టాకు 50, ఉత్తర, దక్షిణ కాలువలకు 550, కండలేరుకు 6 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.78,630
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రాము)	రూ7,133
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,347
నవర (8 గ్రాములు)	రూ.58,776

గరిష్టం/కనిష్టం
28.5 /22.6

వాతావరణం

జిల్లాలో గురువారం ఒకటి, రెండుచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణం శాఖ వెల్లడించింది. గాలిలో తేమ బుధవారం 77 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ఠారెత్తిస్తున్న టమాటా ధర



నెల్లూరు (సెంట్రల్): టమోటా రేట్లు ఎప్పుడు ఏ విధంగా ఉంటాయో తెలియని పరిస్థితి నెలకొంది. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు నెల్లూరులోని హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ వ్యాపారులు అమాంతంగా రేట్లు పెంచుతుంటారు. మొన్నటి వరకు కిలో టమాటా రూ.40 ఉండగా, తాజాగా కిలో రూ.80కు చేరింది. రిటైల్ మార్కెట్‌లో రూ.90 వరకు విక్రయాలు చేస్తున్నారు. టమాటాలు రైతుల వద్ద విరివిగా దొరుకుతున్నా మార్కెట్ వ్యాపారులు మాత్రం కొనుగోలుదారుల నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. వీటితో పాటు ఉల్లిపాయలు, వంకాయలు ఇతర కొన్ని కూరగాయలు కూడా కిలో రూ.70 దాకా విక్రయాలు చేస్తున్నారు.

1న జిల్లా స్విమ్మింగ్ జట్ల ఎంపిక

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్ర స్థాయి అమెచ్యూర్ ఆక్వాటిక్ పోటీల్లో పాల్గొనే జిల్లా స్విమ్మింగ్ జట్ల ఎంపిక డిసెంబర్ 1వ తేదీన ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం స్విమ్మింగ్ పూల్‌లో ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సుంకర మధు, కె.సనత్‌కుమార్ బుధవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు విశాఖపట్నంలో డిసెంబర్ 7వ తేదీన జరిగే సబ్ జూనియర్, జూనియర్ రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్టుగా పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఎంపికలకు హాజరయ్యే వారు స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా గుర్తింపు కార్డు కలిగి ఉండాలని వివరించారు. ఈ నెల 30వ తేదీలోపు తమ పేర్లను స్విమ్మింగ్ అసోసియేషన్ ట్రెజరర్ ఎస్.శివశంకర్‌రెడ్డి వద్ద నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు డీఎస్‌ఏ కోచ్ నాగరాజును 8801916198 నంబరులో సంప్రదించాలని సూచించారు.

8న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

నెల్లూరు (టౌన్): జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్) డిసెంబర్ 8న నిర్వహించనున్నట్లు డీఈఓ ఆర్.బాలాజీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఉదయం 10 నుంచి 1 గంట వరకు జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు సంబంధించి హాల్‌టికెట్లను పరీక్షల సంచాలకుల కార్యాలయం వెబ్‌సైట్ www.bse.ap.gov.inలో అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాల యూడైస్ కోడ్‌ను ఉపయోగించి లాగిన్ అయి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందజేయాలన్నారు.

పక్కాగా సాగునీటి సంఘాల ఎన్నికలు

నెల్లూరు రూరల్: సాగునీటి సంఘాల ఎన్నికలను పక్కాగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధం కావాలని సోమశిల ప్రాజెక్ట్ ఈఈ మల్లికార్జున అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ, పోటీలో నిలిచిన అభ్యర్థి, ఏకగ్రీవంగా ఎంపికైన అభ్యర్థి ప్రకటన అంశాలకు సంబంధించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు అవగాహన కల్పించారు. డీఈ అంకమ్మరావు, పలువురు డీఈలు, ఏఈలు, తహసీల్దార్లు, డీటీలు పాల్గొన్నారు.

‘బెల్టు’ తీసే దమ్ముందా?



- బార్లను తలపిస్తున్న బెల్టు షాపులు
- నేషనల్ హైవే పక్కనే మద్యం దుకాణాలు
- అక్కడే సిట్టింగ్ వసతులు.. వెరైటీ స్టఫ్‌లు
- మర్రిపాడులో బెల్టు దుకాణాలకు వేలం పెట్టిన మద్యం సిండికేట్
- కోవూరు నియోజకవర్గంలో లైసెన్స్ ఒక చోట.. షాపు మరో చోట
- చర్యలు లేకపోవడంతో విచ్చలవిడిగా దుకాణాలు

జిల్లాలో ఊరూరా మద్యం బెల్టు షాపులు ఓ రేంజ్‌లో నడుస్తున్నాయి. మద్యం దుకాణాల్లో కంటే బెల్టు షాపుల్లోనే వ్యాపారం జోరుగా జరుగుతుందంటే అతిశయోక్తి కాదనే చెప్పాలి. బార్లను తలపించే రీతిలో బెల్టు షాపులు, మద్యం దుకాణాల్లో సిట్టింగ్ ఏర్పాట్లు చేసి వెరైటీ స్టఫ్‌లు అందిస్తున్నారు. మద్యం షాపులను హస్తగతం చేసుకున్న కూటమి నేతలు తమ పార్టీల క్యాడర్ ఆర్థికంగా బలపడేందుకు బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారు. పల్లె, పట్నం తేడాలేకుండా వీధికొకటి.. ఊరుకు ఆరు లెక్కన బెల్టు షాపులను ఏర్పాటు చేశారు.



వెంకటాచలం నుంచి కసుమూరుకు వెళ్లే రహదారిలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో బెల్టు దుకాణాల దందా నడుస్తోంది. మద్యం షాపుల నుంచి బెల్టు దుకాణాల వరకు అన్నీ టీడీపీ నేతలే నడుపుతుండడంతో ఆపే దమ్ము ఇటు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులకు, పోలీసులకు లేకుండా పోయింది. అడిగేదెవరు.. ఆపేదెవరంటూ నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. కూటమి నేతలు ఏ స్థాయికి బరితెగించారంటే.. బెల్టుషాపుల నిర్వహణకు బహిరంగ వేలం పాటలు పెట్టే పరిస్థితికి వచ్చారు. చాటు మాటుగా నిర్వహించే బెల్టు షాపులను ఇప్పుడు ఏకంగా లైసెన్స్‌డ్ బార్లు మాదిరిగా నిర్వహిస్తున్నారు. లైసెన్స్ దుకాణాలకే సిట్టింగ్ పర్మిట్ రూమ్‌ల ఏర్పాటుకు అనుమతి లేకపోతే.. బెల్టుషాపుల్లో సిట్టింగ్ వసతులు, కోరిన వెరైటీల్లో వేడివేడి స్టఫ్‌లు అందిస్తున్నారంటే బెల్టు దందా ఏ రేంజ్‌లో ఉందో అర్థం చేసుకోవచ్చు.

24 గంటలూ అందుబాటులో మద్యం

ప్రభుత్వ నిబంధనల ప్రకారం బెల్టు షాపుల నిర్వహణ నేరం. అయితే మద్యం వ్యాపారం అధికార పార్టీకి చెందిన వారి చేతుల్లోకి వెళ్లడంతో పట్టణాలు, గ్రామాల్లో బెల్టు షాపులను విచ్చలవిడిగా ఏర్పాటు చేశారు. గతంలో బెల్టు షాపుల్లో కేవలం ఛీప్ లిక్కర్ మాత్రమే అందుబాటులో ఉండేది. ప్రస్తుతం మద్యం షాపుల్లో దొరికే అన్నిరకాల



మద్యం దుకాణంలో తాగేందుకు వీలుగా ఏర్పాటు చేసిన సౌకర్యాలు

బ్రాండ్లు, బీర్లు అందుబాటులో ఉన్నాయి. బెల్టు దుకాణాల్లో క్వార్టర్ బీరుపై అదనంగా రూ.50 వరకు వసూలు చేస్తున్నారు. మద్యం దుకాణాలతో పాటు బెల్టుషాపులకు అనుబంధంగా పక్కనే కూల్ డ్రింక్ షాపుల ముసుగులో సిట్టింగ్ రూమ్‌లు కొనసాగుతున్నాయి. మద్యం దుకాణాలు నిబంధనల మేరకు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు, బార్లలో ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకు మాత్రమే విక్రయాలు సాగించాలి. అయితే అందుకు భిన్నంగా 24/7 గంటలూ మద్యం విక్రయాలు జరుగుతున్నాయి.

డమ్మీగా మారిన ఎక్సైజ్ శాఖ

జిల్లాలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డమ్మీగా మారి కూటమి పార్టీ నేతల చెప్పు చేతల్లో పనిచేస్తోంది. జిల్లా వ్యాప్తంగా నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణాలు, బెల్టుషాపులు ఏర్పాటు చేస్తున్నా.. నియంత్రించే స్థితిలో ఆ శాఖ లేదనే చెప్పాలి. విచ్చలవిడిగా బెల్టుషాపులకు బహిరంగంగానే వేలం పాటలు నిర్వహించే ఏర్పాటు చేస్తున్నారనే విషయం తెలిసినా.. ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. తమ శాఖ ఉందని చెప్పుకోవడానికి అన్నట్లుగా ఎక్సైజ్, ఏపీ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఈఎస్ స్క్వాడ్ అధికారులు మొక్కుబడి చర్యలకే పరిమితమయ్యారన్న విమర్శలున్నాయి. ఎక్కడో అధికార పార్టీకి వ్యతిరేకులు ఎవరైనా మద్యం తీసుకెళ్లి విక్రయిస్తున్నారని తెలిసి వారిపైనే కేసులు నమోదు చేశారనే ఆరోపణలు లేకపోలేదు. ఆ మద్యం ఏ షాపు నుంచి తెచ్చారో ఆ షాపుపై కేసు నమోదు చేయకపోవడం చూస్తే మద్యం వ్యాపారులు, బెల్టు షాపుల నిర్వాహకులతో కుదుర్చుకున్న ముందస్తు ఒప్పందాలే కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

3 వేలకుపైగా బెల్టు షాపులు

జిల్లాలో 37 మండలాలు, నెల్లూరు కార్పొరేషన్‌తోపాటు కావలి, ఆత్మకూరు మున్సిపాలిటీలు, బుచ్చిరెడ్డిపాళెం, అల్లూరు నగర పంచాయతీల్లో 182 మద్యం గెజిట్ దుకాణాలున్నాయి. గ్రామ పంచాయతీలు, మజరా గ్రామాలు కలిపి దాదాపు 2 వేలకుపైగా ఉంటాయి. ఇక కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో వెయ్యికిపైగా ప్రాంతాలు ఉంటాయి. ఎక్కడికక్కడ బెల్టు షాపుల ద్వారా కూటమి పార్టీల కేడర్‌కు ఆర్థికంగా వెసులుబాటు కల్పించేందుకు ఏరియాకొకటి కేటాయించారు. ఇలా ప్రతి మద్యం దుకాణానికి అనుబంధంగా 30 నుంచి 35 బెల్టు షాపులు కేటాయించినట్లు ఆ పార్టీ కేడరే చెబుతోంది. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా 3 వేలకు పైగా బెల్టుషాపులు ఉన్నట్లు ప్రాథమిక అంచనా.

దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నాం

జిల్లాలో బెల్టు షాపులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదు. మాకు అందిన సమాచారం మేరకు తరచూ దాడులు నిర్వహించి మద్యం పట్టుకుని వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. జిల్లాలో నూతన మద్యం పాలసీ అమలు జరిగినప్పటి నుంచి ఇప్పటి వరకు 181 కేసులు నమోదు చేసిన 182 మందిని అరెస్ట్ చేశాం. వారి నుంచి 420 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నాం. ఎక్కడైనా అనధికార మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటాం. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతాం.

– ఎ.శ్రీనివాసులనాయుడు, ఏసీ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ

విచ్చలవిడి తనానికి పరాకాష్ట

- సర్వేపల్లి నియోజకవర్గంలోని వెంకటాచలం నుంచి కసుమూరు వెళ్లే రహదారిలో ఏర్పాటు చేసిన మద్యం షాపు బార్‌ను తలపిస్తోంది. షాపు పక్కనే పర్మిట్ రూమ్ సిద్ధం చేసి బార్‌లో ఉన్నట్లుగా హంగులతో మందుబాబులు కూర్చొని తాగేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. ఇక్కడ ఎనీటైం మద్యం తాగేందుకు సౌకర్యాలు కల్పించారంటే ఏ స్థాయిలో బరితెగించారో ఈ దుకాణమే అద్దం పడుతోంది. ఇక ఈ షాపులో మద్యం ఎమ్మార్పీ కంటే రూ.20 అదనం. షాపును బహిరంగంగా బార్‌లా మార్చేసినా సంబంధిత ఎక్సైజ్ శాఖ, పోలీసులు పట్టించుకోలేదంటే వీరిలో చేవ చచ్చిపోయిందా? లేక మామూళ్ల మత్తులో జోగుతున్నారా? అనే విమర్శలు వినిపిస్తున్నాయి.
- కోవూరు నియోజకవర్గం కొడవలూరు మండలం పరిధిలోని నేషనల్ హైవేకు 50 మీటర్ల దూరంలోనే గండవరం రోడ్డులో మద్యం షాపు ఏర్పాటు చేశారు. ఆ దుకాణం మంత్రి నారాయణ ముఖ్య అనుచరుడిది కావడంతో నిబంధనలు పాటించడం లేదు. వాస్తవంగా ఈ షాపు ఏర్పాటుకు లైసెన్స్ ఇచ్చిన ప్రదేశం వేరే అయితే.. నిబంధనలకు విరుద్ధంగా నేషనల్ హైవే పక్కనే పెట్టారు. ఆయన మంత్రి ముఖ్య అనుచరుడు, అధికార పార్టీ నేత కావడంతో అడిగే దమ్ము ఎక్సైజ్ శాఖ, పోలీసులకు లేకుండా పోయింది.
- కోవూరు మండలంలోని సాలుచింతల వద్ద నేషనల్ హైవేకు 30 మీటర్ల దూరంలోనే మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. నిబంధనల ప్రకారం హైవేకు 220 మీటర్ల దూరంలో షాపు ఉండాలి. కానీ హైవే పక్కనే షాపు ఏర్పాటు చేసి దర్జాగా మద్యం విక్రయాలు చేసుకుంటున్నా.. అధికారుల్లో ఉలుకు పలుకు లేదు.
- మర్రిపాడు మండంలో ఐదు మద్యం షాపులు ఏర్పాటు చేశారు. వాటి యాజమానులు సిండికేట్‌గా ఏర్పడ్డారు. డీసీపల్లి దుకాణానికి అనుబంధంగా కూల్ డ్రింక్స్ షాపులో బెల్టు షాపు ఏర్పాటుకు నెలకు రూ.70 వేలు, మర్రిపాడులో రూ.90 వేలు, చుంచులూరులో రూ.45 వేలు, చినమాచనూరులో రూ.40 వేలు కృష్ణాపురంలో రూ.60 వేలు వంతున మద్యం సిండికేట్‌కు చెల్లించేలా వేలం ద్వారా ఒప్పందాలు కుదుర్చుకుని బెల్టు దుకాణాలు ఏర్పాటు చేశారు.

ముంచుకొస్తున్న ఫెంగల్ ముప్పు

- పోర్టులో ఒకటో నంబర్ ప్రమాద హెచ్చరిక
- మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచన
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

నెల్లూరు(అర్బన్): బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం తుఫాన్‌గా మారనుందని వాతావరణశాఖ ప్రకటించింది. దీనికి ‘ఫెంగల్’ అని నామకరణం చేశారు. ఈ తుఫాన్ శ్రీలంక వైపు కదిలిపోతుందనుకుంటుంటే.. దిశ మార్చుకుని తమిళనాడు వైపు దూసుకొస్తోంది. దీని ప్రభావంతో ఆ రాష్ట్రంలో వర్షాలు దంచి కొడుతున్నాయి. ఈ తుఫాన్ ముప్పు చెన్నై సరిహద్దులో ఉన్న నెల్లూరు జిల్లాకు ఉంటుందని, ఈనెల 28 నుంచి జిల్లాలోనూ భారీ వర్షాలు కురిసే అవకావం ఉందని వాతావరణ శాఖాధికారులు ప్రకటించారు. ఇప్పటికే కృష్ణపట్నం పోర్టులో ఒకటో నంబర్ ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. మత్స్యకారులు సముద్రంలోనికి వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. కలెక్టర్ ఆనంద్ జిల్లా అధికారులందరినీ అప్రమత్తం చేశారు. భారీవర్షాలు పడితే ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. సహాయక చర్యలు ముమ్మరంగా చేపట్టేందుకు సర్వం సిద్ధం చేసుకోవాలని సూచించారు. మరో వైపు అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యలకు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధం చేశారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. టోల్ ఫ్రీ నంబర్ 0861–2331261కు ప్రజలు సహాయం కోసం ఫోన్ చేయొచ్చని తెలిపారు. శనివారం (ఈనెల 30వ తేదీ) నాటికి తుఫాన్ తమిళనాడు ప్రాంతంలో తీరం దాటే అవకాశం ఉంది. ఈ ప్రభావంతో తీరం వెంబడి గంటకు 55 నుంచి 65 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తెలిపింది.

వర్షాలకు రైతులు అప్రమత్తంగా ఉండాలి

నెల్లూరు (సెంట్రల్): తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని, జిల్లాలో ప్రస్తుతం రబీ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో వరినారు మళ్లు సిద్ధం చేసుకున్న రైతులు అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త వినీత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధానంగా నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలని, వరిలో ఎక్కువగా నీరు నిల్వ ఉంటే పలు తెగుళ్ల వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సలహాలు తీసుకోవాలని సూచించారు. తుఫాన్ గండం పొంచి ఉన్నందున వర్షం చూసుకుని నాట్లు వేసుకుంటే మంచిదని సూచించారు.

అంచెలంచెలుగా ఎదిగి..

- దారుణహత్యకు గురైన హాసిని
- కోస్తా, రాయలసీమ హిజ్రా నేతగా గుర్తింపు

కొడవలూరు: మండలంలోని టపాతోపు అండర్ బ్రిడ్జి వద్ద మంగళవారం రాత్రి హత్యకు గురైన మానికల హాసిని (33) చిన్నప్రాయంలోనే తక్కువ సమయంలోనే నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప, కర్నూలు, నంద్యాల, చెన్నై, కర్ణాటక ప్రాంతాల్లోని సుమారు పది వేల మందికి హాసిని నాయకురాలుగా ఎదిగింది. ఆమె ఎదుగుదలను జీర్ణించుకోలేని హిజ్రాల్లోనే మరోవర్గం ఈ కిరాతకానికి పాల్పడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తోటపల్లిగూడూరు మండలం చిన్నచెరుకూరు గిరిజన కాలనీకి చెందిన మానికల శ్రీనివాసులు, విజయమ్మ దంపతులకు ఇద్దరు ఆడ పిల్లలు, ఒక మగ పిల్లవాడు. మధ్య సంతానంగా మగ పిల్లవాడిగా జన్మించిన సుదీప్ మొదటి నుంచి తేడాగా ఉండేవాడు. తండ్రి టైలర్ కాగా, తల్లి విజయమ్మ వ్యవసాయ పనులకు వెళుతూ ముగ్గురు పిల్లలను చదివించారు. ఏడో తరగతి వరకు గ్రామంలోని పాఠశాలలోనే చదివిన సుదీప్ ఆ తర్వాత ఇంటి నుంచి పారిపోయారు. అప్పటికే హిజ్రా లక్షణాలు కలిగి ఉన్న సుదీప్ హిజ్రాలతో పరిచయం పెంచుకుని పూర్తిగా హిజ్రాగా మారి హాసినిగా పేరు మార్చుకున్నారు. ఆకర్షణీయంగా కనిపించే హాసిని హిజ్రాల్లో ప్రత్యేకతను చాటుకుంటూ నాయకత్వ బాధ్యతలు తీసుకుంది. ఆర్థికంగా స్థిరపడ్డాక కుటుంబాన్ని తిరుపతికి మార్చుకుంది. కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో హిజ్రాల సమస్యలపై తరచూ సమావేశాలు నిర్వహి స్తూ వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తూ బాగా గుర్తింపు తెచ్చుకుంది. ఆర్థికంగానూ బలపడడంతో నెల్లూరులోని మాగుంట లేఅవుట్‌లో ఒక ఇల్లు, రాజీవ్‌గాంధీనగర్‌లో రెండు ఇళ్లు, తిరుపతిలో ఒక ఇల్లు నిర్మించుకున్నట్లు తెలిసింది. తల్లిదండ్రులకు చిన్నచెరుకూరులో ఇల్లు నిర్మించడంతో పాటు ఆర్థికంగా అండగా ఉండేదని సమాచారం. హాసిని తల్లి స్వగ్రామం విడవలూరు మండలం పార్లపల్లిలో మహాలక్ష్మి అమ్మ వారి ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించింది. నిర్మాణం పూర్తికావడంతో సోమవారం నుంచి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు జరుగుతున్నాయి. దీంతో మంగళవారం జరిగిన అభిషేకాలు, పూజలకు హాసిని తన సహచర హిజ్రాలు 20 మందిని తీసుకెళ్లారు. అక్కడ రాత్రి 10 గంటల వరకు అభిషేకాలు, పూజల అనంతరం అక్కడి నుంచి నెల్లూరుకు బయలుదేరారు. హాసిని కారులో వస్తుండగా సహచరులు ఆటోల్లో వెనుక అనుసరించారు. టపాతోపు అండర్ పాస్ వద్ద రెండు కార్లలో కాపుకాచిన ఆరుగురు వ్యక్తులు అటకాయించి కారులో ఉన్న హాసిని మెడపై విచక్షణా రహితంగా నరికి పారిపోయారు. వెనుక ఆటోల్లో వచ్చిన సహచరులు గమనించి చూడగా హాసిని రక్తపు మడుగులో పడి ఉంది. హుటాహుటిన నెల్లూరులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా అప్పటికే హాసిని మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఎస్సై కోటిరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అంబులెన్స్‌లో తరలిస్తున్న హాసిని మృతదేహం



హాసిని (ఫైల్)

పోలీసుల అదుపులో నిందితులు?

సాక్షి, టాస్క్‌ఫోర్స్: సంచలనం రేకెత్తించిన హాసిని హత్య కేసును పోలీసులు ఛేదించినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై కొడవలూరు ఇన్‌స్పెక్టర్ సురేంద్రబాబు తన సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. నెల్లూరురూరల్ మండలానికి చెందిన ఓ యువకుడు ఓ హిజ్రా గ్యాంగ్‌లో ఉన్న హిజ్రా తో సహజీవనం చేస్తున్నారు. ఆ యువకుడిని హాసిని, ఆమె అనుచరులు పలుమార్లు అందరి ముందు తీవ్రంగా అవమానించినట్లు సమాచారం. దీంతో కక్ష పెంచుకున్న సదరు యువకుడు తన సహచరులతో కలిసి ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. సాంకేతికత ఆధారంగా పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని లోతుగా విచారిస్తున్నట్లు తెలిసింది. హాసిని ఆధిపత్యాన్ని కొందరు హిజ్రాలూ వ్యతిరేకిస్తున్నారు. వారు సోషల్ మీడియా వేదికగా హాసినిని దూషిస్తూ పోస్టులు పెట్టడం, బెదిరింపు చర్యలకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో వారి ప్రమేయం ఉందా? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

కలకలం రేపిన హిజ్రా హాసిని హత్య

- హంతకులను తక్షణమే అరెస్ట్ చేయాలి
- మార్చురీ ఎదుట సహచరుల ధర్నా
- పోస్టుమార్టం అనంతరం అశ్రునయనాల మధ్య మృతదేహం తిరుపతికి తరలింపు

నెల్లూరు(క్రైమ్): జిల్లాలో మంగళవారం రాత్రి జరిగిన హిజ్రా హాసిని హత్యోదంతం కోస్తా, రాయలసీమ జిల్లాల్లో కలకలం రేకెత్తించింది. ఆమె సహచరులు కడప, చిత్తూరు, తిరుపతి, తమిళనాడు రాష్ట్రం నుంచి పెద్ద సంఖ్యలో బుధవారం తెల్లవారు జామునే నెల్లూరుకు చేరుకున్నారు. హత్యకు దారి తీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. హాసిని మృతదేహం జీజీహెచ్ మార్చురీలో ఉండడంతో కొందరు అక్కడికి వచ్చి అక్కడే బైఠాయించగా మరికొందరు నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావును ఆయన ఇంటి వద్ద కలిశారు. తమ నాయకురాలు హత్య కేసులో నిష్పక్షపాతంగా విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. చట్ట ప్రకారం విచారణ జరిపి నిందితులను శిక్షిస్తామని డీఎస్పీ వెల్లడించడంతో జీజీహెచ్‌లోని మార్చురీ వద్దకు చేరుకున్నారు. మృతదేహానికి ప్రభుత్వ వైద్యులు శవపరీక్ష నిర్వహించి బాధితులకు అప్పగించారు. అశ్రునయనాల మధ్య హాసిని మృతదేహాన్ని అంబులెన్స్‌లో తిరుపతికి తరలించారు. మార్చురీ వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్య ఆధ్వర్యంలో ఎస్‌ఐ రమేష్‌బాబు తమ సిబ్బందితో కలిసి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



మార్చురీ రహదారిలో బైఠాయించిన హిజ్రాలు

పండు ఈగతో పంట నష్టం

■ జామ రైతు దిగాలు ■ పాడైపోతున్న కాయలు



తైవాన్ జామ తోటలు సాగు చేసిన జిల్లా రైతులు ప్రస్తుతం సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. జిల్లాలో సుమారు వెయ్యి ఎకరాల్లో 350 మంది రైతులు ఈ తోటలు సాగు చేస్తున్నారు. తోటలు తెగుళ్ల బారినపడి పంట దిగుబడి తగ్గింది. పండు ఈగ వల్ల పండ్లు పనికిరాకుండా పోతున్నాయి.

– పొదలకూరు

- పండుఈగ కాయల్లోని రసాన్ని పీల్చి, పండులోకి వైరస్‌ను వదలడం వల్ల కాయలు పాడైపోతున్నాయి.
- జిల్లాలో పొదలకూరు, ఆత్మకూరు, రాపూరు, చేజర్ల, కలువాయి, మనుబోలు తదితర మండలాల్లో తైవాన్ జామ సాగవుతోంది. ఒకసారి మొక్కలు నాటితే పదేళ్ల వరకు కాపు కాస్తుంది.
- జామతోటల నుంచి ఒకేసారి దిగుబడి రావడం వల్ల వాటికి మార్కెట్‌లో గిట్టుబాటు రేటు లభించడం లేదు. పండ్లు నిల్వ చేసుకునే కోల్డ్ స్టోరేజీలు లేకపోవడం వల్ల రైతులు పంటను తక్కువ రేటుకైనా అమ్ముకోవలసి వస్తోంది.
- ప్రస్తుతం కిలో రూ.20 నుంచి రూ.30 అమ్ముడుపోతున్నట్టు రైతులు తెలిపారు. దూరప్రాంతాలకు ఎగుమతి చేసినా 22 కిలోల బాక్సు రూ.500 మాత్రమే అమ్ముడుపోతున్నాయి. గతంలో బాక్సుకు రూ.650 ధరలు పలికేవి.
- మెట్టప్రాంత గ్రామాల్లో పండే జామకాయలు నెల్లూరు, చెన్నై మార్కెట్‌కు తరలిస్తున్నారు. చెన్నై మార్కెట్ వ్యాపారులు కొందరు తోటల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు.

పండు ఈగను నివారించాలంటే..

- పండు ఈగ వల్ల కాయలు, పండ్లకు పురుగు పడుతుంది. జామ కాయలో పురుగులు ఉంటే మార్కెటింగ్‌కు పనికిరావు. అయితే ఫ్రూట్ ఫ్లెటై బాక్సుల ఏర్పాటు వల్ల ఈగలను అరికట్టవచ్చని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. బాక్సుల్లో మిథైల్ ఇథనాల్ కలిగిన చెక్కలను వేసి వాటిపై రెండు బొట్లు నువాన్ వేయాలి. ఆ వాసనకు మగ ఈగలు ఆకర్షించబడి రసాయనం వల్ల మృతి చెందుతాయి. దాంతో పండు ఈగల సంతానోత్పత్తి తగ్గి తోటల్లో లేకుండాపోతాయి.



తైవాన్ జామ తోట

ధరలు దిగజారాయి



జామ కాయల ధరలు దిగజారాయి. పెట్టుబడులు పెరిగినా ధరలు పెరగకపోవడం వల్ల రైతులు నష్టపోవాల్సి వస్తోంది. పండు ఈగల ధాటికి తట్టుకోలేకపోతున్నాం. వీటిని నివారించలేక పోవడం వల్ల కాయలకు పురుగుపట్టి మార్కెటింగ్ చేసుకునేందుకు ఇబ్బందిగా మారింది.

– యాతం పెంచలరెడ్డి, రైతు, మొగళ్లూరు

రైతులకు సూచనలు ఇస్తున్నాం



తైవాన్ జామ రైతులకు సలహాలు, సూచనలు చేస్తున్నాం. పండు ఈగలను అరికట్టేందుకు వివిధ రకాల పద్ధతులు ఉన్నాయి. ఇందులో బాక్సులను ఏర్పాటు చేసే పద్ధతి ఒకటి. సకాలంలో మందులను పిచికారీ చేసుకుంటే నష్టాల నుంచి బయట పడవచ్చు.

– ఈ.ఆనంద్, ఉద్యానశాఖ అధికారి, పొదలకూరు


స్టోన్‌హౌస్‌పేట మెయిన్ రోడ్డులో వాహనాల రద్దీ



నడిరోడ్డుపైనే లోడింగ్, అన్‌లోడింగ్


ప్రధాన రహదారిపై వాహనాలు పెట్టేస్తారంతే..

ఇలా ఉంటే తిరిగేదెలా..!

నెల్లూరులోని స్టోన్‌హౌస్‌పేటకు జిల్లాలోనే ఎంతో ప్రత్యేకత ఉంది. ఇది ప్రముఖ వాణిజ్య కేంద్రం. ఇక్కడి నుంచే చాలావరకూ నిత్యావసరాలు, ఇతర వస్తువులు పల్లెలకు వెళ్తుంటాయి. అయితే ఇరుకురోడ్లు.. ఆపై చొచ్చుకొచ్చిన ఆక్రమణలు.. నడిరోడ్లపైనే వస్తువులు లోడింగ్, అన్‌లోడింగ్.. అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్ కారణంగా నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. స్టోన్‌హౌస్‌పేట, పప్పులవీధి, రేబాలవారి వీధి తదితర ప్రాంతాల్లో దుకాణాలు విస్తరించి ఉన్నాయి. వీటికి జిల్లా నలుమూలల నుంచి రోజూ పెద్ద సంఖ్యలో కొనుగోలుదారులు వస్తుంటారు. అయితే దుకాణాలకు సరైన పార్కింగ్ లేదు. వాహనదారులు రోడ్డుపైనే వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి సామగ్రిని తీసుకొచ్చే భారీ వాహనాలు నిర్దేశిత సమయాల్లోనే లోడింగ్, అన్‌లోడింగ్ చేయాల్సి ఉన్నా అలా జరగడం లేదు. బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో ముఖ్యమైన వంతెనలు మూడు ఉండగా ఒకదానిని ఆటో స్టాండ్‌గా మార్చేశారు. ఇంకా షాపుల వద్ద రోడ్లపైనే ఆటోలను గంటల తరబడి ఆపేస్తున్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

– నెల్లూరు(క్రైమ్)

మోటార్ల చోరీ కేసులో నిందితుల అరెస్ట్

బిట్రగుంట: బోగోలు, దగదర్తి, జలదంకి మండలాల్లోని పంట పొలాల్లో విద్యుత్ మోటార్ల చోరీకి పాల్పడుతున్న నిందితుడిని, మరో బాలుడిని బిట్రగుంట పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వారి కథనం మేరకు.. సుందరగిరివారి కండ్రిగకు చెందిన జంగా సుబ్బారెడ్డి తన పొలానికి నీరు పారించుకునేందుకు ఎస్వీపీఎం కట్టపై ఏర్పాటు చేసుకున్న మోటార్‌ను ఈనెల 19వ తేదీన గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన ఎస్సై భోజ్యా కప్పరాళ్లతిప్పకు చెందిన గోగుల శామ్యూల్ చోరీకి పాల్పడినట్లుగా గుర్తించి నాగులవరం సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. సుబ్బారెడ్డి 5హెచ్‌పీ మోటార్‌తోపాటు జలదంకి మండలానికి సంబంధించిన రెండు 5హెచ్‌పీ మోటార్లు, దగదర్తి మండలానికి సంబంధించిన మూడు 5హెచ్‌పీ మోటార్లు స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై తెలిపారు.

నిమ్మ ధరలు (కిలో)


పెద్దవి : రూ.35
సన్నవి : రూ.25
పండ్లు : రూ.15

• కాకాణితో ప్రసన్న భేటీ


గోవర్ధన్‌రెడ్డితో మాట్లాడుతున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డితో నగరంలోని డైకస్ రోడ్డులో ఉన్న ఆయన నివాసంలో మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు పాల్గొన్నారు.

– నెల్లూరు(బారకాసు)

పొట్టకూటి కోసం వచ్చి..

- పోలీస్ జీపు ఢీకొని బెంగాల్ వాసి మృతి


విశ్వజిత్ మృతదేహం

బుచ్చిరెడ్డిపాళెం: పొట్టకూటి కోసం వేరే రాష్ట్రం నుంచి వచ్చిన వలస కూలీ పోలీస్ జీపు ఢీకొని మృతిచెందాడు. ఈ ఘటన బుచ్చిరెడ్డిపాళెం సమీపంలోని రేబాల వద్దనున్న పెట్రోలు బంకు ఎదురుగా మంగళవారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన విశ్వజిత్ మండల్ (40), మరికొందరు బుచ్చిరెడ్డిపాళెం పరిసర ప్రాంతాల్లో వరినాట్లు వేసేందుకు వచ్చారు. మరో రెండు రోజుల్లో వారు పనులు పూర్తి చేసి సొంతూరికి బయలుదేరాల్సి ఉంది. కాగా మంగళవారం రాత్రి పెట్రోల్ బంకు సమీపంలో విశ్వజిత్ రోడ్డు దాటుతున్నాడు. ఈ సమయంలో బుచ్చిరెడ్డిపాళెం సీఐ శ్రీనివాసరెడ్డి నెల్లూరుకు జీపులో బయలుదేరారు. ఈ వాహనం విశ్వజిత్‌ను ఢీకొంది. అతడిని వెంటనే సీఐ, కానిస్టేబుళ్లు అదే వాహనంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బెంగాల్‌కు చెందిన ఉత్తమ మండల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విశ్వజిత్ మృతదేహానికి బుధవారం డాక్టర్లు పోస్టుమార్టం చేయగా బెంగాల్‌కు తరలించారు.

నకిలీ ఆర్టీఓ హల్‌చల్

- పట్టుకోవడానికి ప్రయత్నించిన ఎంవీఐ

ఉలవపాడు: మండలంలోని రాజుపాళెం – ఉలవపాడు మధ్యలో బుధవారం నకిలీ ఆర్టీఓ హల్‌చల్ చేశాడు. సుబ్బరాయుడు సత్రం నుంచి కందుకూరు మండలం కోవూరుకు మామిడి కాయల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను నకిలీ ఆర్టీఓ, మరో వ్యక్తి కారులో వచ్చి ఆపారు. వాహనంలో నుంచి దిగకుండా ట్రాక్టర్ డ్రైవర్ శింగరాయకొండకు చెందిన కుమ్మరి బాలకృష్ణను పిలిచి లోడ్ అధికంగా ఉందని రూ.15 వేలు ఫైన్ కట్టాలని భయపెట్టారు. కారు ముందు భాగంలో ఆర్టీఓ అని రాసి ఉంది. డ్రైవర్ ఆందోళన చెంది తన వద్ద అంత మొత్తం లేదని చెప్పగా నకిలీ అధికారి రూ.3 వేలను ఆన్‌లైన్ ద్వారా వేయించుకున్నాడు. ఈ సమయంలో అదేరూట్‌లో కందుకూరు ఎంవీఐ రాంబాబు తన వాహనంలో వెళ్తూ గమనించి నకిలీ ఆర్టీఓ వాహనాన్ని వెంబడించడానికి ప్రయత్నించగా వారు కారును వేగంగా నడుపుతూ పరారయ్యారు. ఎంవీఐ డ్రైవర్ వద్ద వివరాలు సేకరించారు. మోసపోయానని గుర్తించిన బాలకృష్ణ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై అంకమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెల్టు దుకాణానికి మద్యం తరలిస్తుండగా..

- 40 బాటిళ్ల స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై

దుత్తలూరు: బెల్టు షాపునకు అక్రమంగా తరలిస్తున్న 40 మద్యం బాటిళ్లను బుధవారం దుత్తలూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై పి.ఆదిలక్ష్మి కథనం మేరకు.. అప్పసముద్రం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బెల్టు షాపులో విక్రయాలు జరిపేందుకు దుత్తలూరు నుంచి వాహనంలో మద్యం బాటిళ్లు అప్పసముద్రం తరలిస్తున్నాడు. దుత్తలూరు సెంటర్‌కు సమీపంలోని జాతీయ రహదారిపై దాడులు నిర్వహించి 40 బాటిళ్లు స్వాధీనం చేసుకోవడంతోపాటు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

క్రికెట్ పోటీలకు ఎంట్రీల ఆహ్వానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే క్రికెట్ టీ20 లీగ్ కమ్ నాకౌట్ పోటీలకు ఎంట్రీలు పంపాలని కార్యదర్శి డి.నిఖిలేశ్వర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు తమ సభ్యుల వివరాలను డిసెంబర్ 6వ తేదీలోపు నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలోని క్రికెట్ అసోసియేషన్ కార్యాలయంలో అందజేయాలన్నారు. ప్రవేశరుసుము రూ.5,000 చెల్లించాలన్నారు. క్రీడాకారులు ఉమ్మడి జిల్లాకు చెందిన వారై ఉండాలన్నారు. వేరే జిల్లాల నుంచి వచ్చి నెల్లూరులో చదువుకునే వారు తమ విద్యాసంస్థల గుర్తింపుకార్డులతో జట్టులో ఉండొచ్చన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నంబర్లు 94405 36270 (నెల్లూరు), 99852 33061 (గూడూరు), 96527 45899 (కావలి), 99597 22799 (వెంకటగిరి)ను సంప్రదించాలన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 109
లేయర్ (లైవ్)	: 110
బ్రాయిలర్ చికెన్	: 200
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 220
లేయర్ చికెన్	: 187

బాల్య వివాహాలను అరికట్టండి

నెల్లూరు రూరల్: బాల్య వివాహాలను అరికట్టేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్ పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన భవన్‌లో కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల ముక్తిభారత్ ప్రచార ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిని బుధవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి అధికారులు, విద్యార్థినులు వర్చువల్‌గా తిలకించారు. అనంతరం పీడీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, బాలల సంరక్షణ అధికారి సురేష్, సోషల్ వెల్ఫేర్ డీడీ శ్రీనివాసులు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సుబ్బారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 52.438 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 52.438 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరుకు వరద కాలువ ద్వారా 1,000 క్యూసెక్కులు, సోమశిల జలాశయం నుంచి 4,000 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. అదేవిధంగా కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,600, పిన్నేరు కాలువకు 20, లో లెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 55 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.